క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు: మండలంలోని సింగారం, వనమాల కనపర్తి, నందనం 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలో లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎస్.రమేష్, ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీంతో సింగారం గ్రామం, వ్యవసాయ కనక్షన్లు, కొండపర్తి గ్రామం, వ్యవసాయ కనక్షన్లు, జగ్గయ్యగూడెం గ్రామం, నందనం గ్రామం, వ్యవసాయ కనెక్షన్లు కలిగిన వారికి విద్యుత్ నిలిపివేయబడుతుంది. రైతులు, గ్రామస్తులు గమనించి సహకరించాలని వారు కోరారు.

బీఆర్‌ఎస్‌కు స్వర్గం రవి రాజీనామా



కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త స్వర్గం రవి బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు శనివారం పంపించినట్లు తెలిపారు. హుజూరాబాద్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన రవి ఎలాంటి పదవిని ఆశించకుండా ఇంతకాలం బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. త్వరలోనే హుజూరాబాద్ నియోజకవర్గంలోని తన అనుచరులు, ముఖ్య నాయకులతో సమాలోచనలు చేసి భవిష్యత్ ప్రణాళికను ప్రకటించనున్నట్లు తెలిపారు.

కేంద్ర బలగాలతో కవాతు



ఐనవోలు : రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంలో శనివారం సివిల్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లకు ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. కవాతులో ఐనవోలు, సంగెం ఎస్సైలు అనిల్ కుమార్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా హోలీ సంబురాలు



దామెర: మండలంలోని కోగిల్వాయి మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగులు చల్లుకుని ఆనందంగా ఆడుతూ గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాస్యం రామానుజం మాట్లాడుతూ హోలీ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బహుభాషా కవి సమ్మేళనం

హన్మకొండ కల్చరల్: వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో బహుభాషా కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు మహమ్మద్ సిరాజుద్దీన్, సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో మధ్యాహ్నం జరగనున్న కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.దామోదర్, ఆత్మీయ అతిథులుగా గ్రంథాలయ మాజీ చైర్మన్ అజీజ్‌ఖాన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, టీజీఓఎస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు పాల్గొంటారని పేర్కొన్నారు.

బాధితులను ఆదుకోండి

నయీంనగర్: సహారా కంపెనీ స్కీంలలో చేరి మోసపోయిన వారిని ఆదుకోవాలని సహారా బాధితుల అఖిల పక్ష సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో మార్క పూజిత మాట్లాడుతూ తమకు న్యాయం చేయకుంటే మరణమే శరణ్యమని వాపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సరళ, బీజేపీ మహిళా కన్వీనర్ డాక్టర్ పద్మజా రాణి, రాము, వేణు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణాను నిరోధించాలి

- ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ బాబులాల్



మాట్లాడుతున్న ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ బాబులాల్

కమలాపూర్: బాలికల అక్రమ రవాణాను నిరోధించాలని, అందుకు గ్రాస్ రూట్ వాటాదారుల సంఘం నాయకులు కృషి చేయాలని ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ జి.బాబులాల్ సూచించారు. మండలంలోని శనిగరం రైతు వేదికలో శనివారం దొర్కాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మై చాయిసెస్ ఫౌండేషన్ సహకారంతో బాలికలపై అత్యాచారాలు, బాలికల అక్రమ రవాణాపై అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, టీచర్లు, మహిళా సంఘాల గ్రూప్ లీడర్లు, గ్రామ పెద్దలకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు, లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలికల అక్రమ రవాణా, బాలికలపై అత్యాచారాలు, వేధింపులు, దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాటిని నిరోధించడానికి ఎన్‌జీఓలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, ఏహెచ్‌టీయూ, కార్మిక, విద్యా, ఆరోగ్య శాఖలతో కలిసి గ్రాస్ రూట్ వాటాదారుల సంఘం నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని తమ ప్రయత్నాలు బలోపేతం చేయాలన్నారు. అనంతరం హ్యాండ్ బుక్స్, పోస్టర్లు ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఫీల్డ్ ట్రైనర్ ఆలేటి సుధాకర్, ఎస్సైలు ఫసియుద్దీన్, మల్లేశం, ఏఎస్సై భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, టీచర్లు, మహిళా సంఘాల గ్రూప్ లీడర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దామెర: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రవి మాట్లాడుతూ పోరాటాలతో హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని పోరాటం సాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అంబి సాంబయ్య, నాయకులు కండె నర్సయ్య, దండు భాస్కర్, గొలుసుల దేవేందర్, నాగబెల్లి ఐలయ్య, గంధం గట్టయ్య, అమ్మ సాంబయ్య, గంధం శోభక్క, దేవక్క, సుమన్, వీరన్న సుకన్య, మమత, కొమురయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి



వేలేరు : విద్యార్థులు తమ లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ప్రహసిత్ అన్నారు. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన మండలంలోని గురుకుల పాఠశాలలో శనివారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించాలంటే పాఠ్యాంశ జ్ఞానంతో పాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. పరీక్షలను భయంతో కాకుండా ఇష్టంతో రాయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రౌతు అజయ్ కుమార్, ఉపాధ్యాయులు రాజగోపాల్, శారద తదితరులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడాలి



నియామక పత్రం అందిస్తున్న ప్రదీప్

హన్మకొండ: మాదిగ హక్కులు, ఆత్మగౌరవం కోసం నిస్వార్థంగా పోరాడాలని మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ పిలుపునిచ్చారు. హనుమకొండ వడ్డెపల్లిలో మాదిగ హక్కుల దండోరా హనుమకొండ జిల్లా సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల సమస్యల కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతోందని చెప్పారు. అనంతరం మాదిగ హక్కుల దండోరా హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఆయన ప్రకటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొచ్చు రాజ్‌కుమార్ మాదిగ, జిల్లా కార్యదర్శిగా ఇల్లందుల నరేష్, హనుమకొండ మండల అధ్యక్షుడిగా నల్ల విజయ్‌పాల్, కార్యదర్శిగా బొచ్చు హరీష్, ఉపాధ్యక్షుడిగా బొచ్చు రామును నియమించినట్లు వెల్లడించారు. అలాగే, గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ అధ్యక్షుడిగా ఒస్కుల అనిల్, డివిజన్ యువసేన అధ్యక్షుడిగా పసునూరి నవీన్, మహిళా అధ్యక్షురాలిగా బొచ్చు సరోజన, కార్యదర్శిగా పసునూరి పుష్పను నియమించినట్లు ప్రదీప్ వివరించారు.

ఫొటోగ్రాఫర్ మృతికి పలువురి సంతాపం

కమలాపూర్: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఫొటోగ్రాఫర్ పత్తిపాక శ్రీధర్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన కమలాపూర్‌లో శనివారం రాత్రి అశ్రునయనాల మధ్య నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అందరితో కలుపుగోలుగా ఉండే శ్రీధర్ మృతితో కమలాపూర్‌లో విషాదం అలుముకుంది. శ్రీధర్ మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గం రవి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

క్రీడలతో సామాజిక చైతన్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి: క్రీడలతో సామాజిక చైతన్యం పెంపొందుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కిట్స్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రొఫెషనల్ కాలేజియట్ టోర్నమెంట్ క్రిట్స్ ట్రోఫీ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు ఇచ్చే ప్రాధాన్యతను క్రీడలకు కూడా ఇవ్వాలని సూచించారు. శారీరక ఎదుగుదలకు ఆటలు దోహదపడుతాయన్నారు. కిట్స్ ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు అవసరమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు కళాశాలలకు చెందిన 800 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారితో పాటు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



శ్రీలత(ఫైల్)

ఐనవోలు: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని పున్నేలు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పున్నేలు కు చెందిన పల్లకొండ శ్రీలత (40)కు కాజీపేటకు చెందిన వ్యక్తితో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా మతిస్థిమితం సమస్యతో బాధపడుతున్న శ్రీలత ఇటీవల పున్నేలులోని పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో తాను వాడుతున్న మందులను మోతాదుకు మించి బుధవారం వేసుకోగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. తండ్రి రాయపురం మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

రేషన్ డీలర్లపై చర్య తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

శాయంపేట : ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం సరఫరాలో సంబంధిత డీలర్లు తూకంతో మాయాజాలం చేస్తూ కార్డుదారులను మోసం చేస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కళ్యాణ్ తహసీల్దార్ సుభాషిణికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌డీలర్లు అవకతవకలకు పాల్పడుతూ బియ్యం సరఫరాలో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజశేఖర్, మనోజ్‌పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న వేలూరి వనజ

సంగెం : మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యమిస్తున్నట్టు హనుమకొండ కనకదుర్గ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వేలూరి వనజ తెలిపారు. మండలంలోని గవిచర్లలోని స్వజన వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామీణ కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలకు జీవనోపాధి కల్పించేలా కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు కుట్టు శిక్షణ, ఇతరత్రా కార్యక్రమాలు వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. మహిళలకు క్లబ్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, వేలూరి శారద, లక్ష్మీనర్సింహారావు, వేలూరి శ్రీదేవి, శ్యామల, శార్వాణి, శశికళ, మాజీ ఎంపీపీ దొనికెల మల్లయ్య, మాజీ సర్పంచ్ దొనికెల రమ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ ఎన్నిక

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో వరంగల్‌కు చెందిన నాటకరంగ కళాకారులైన ఆకుల సదానందం రాష్ట్ర అధ్యక్షుడిగా, డాక్టర్ కాజీపేట తిరుమలయ్య ఉపాధ్యక్షుడిగా, సభ్యుడిగా బాలాజీ, సలహా మండలి సభ్యుడిగా లక్ష్మికాంతారావు ఎన్నికయ్యారు.

మొగిలిచర్లలో ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ మల్లేశ్వర్

గీసుకొండ : గ్రేటర్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లలో వరంగల్‌కు చెందిన లలిత కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ బొట్టు మల్లేశ్వర్ తన తండ్రి కుమారస్వామి జ్ఞాపకార్థం శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ మల్లేశ్వర్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

బీజేపీ జేబు సంస్థగా ఈడీ



హసన్‌పర్తి: ఈడీ, సీబీఐలను తన జేబు సంస్థగా మార్చుకుని ప్రతిపక్ష పార్టీల నేతలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి రొయ్యల రాజు విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని అరెస్టులతో కేంద్రం బెదిరింపులకు గురి చేస్తోందని అన్నారు. ఈక్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, సత్యం, కిరణ్, ప్రభాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న శుభంనగరాలే

దామెర: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపీఎస్ శుభం నగరాలే అన్నారు. మండలంలోని పసరగొండలో ఏర్పాటు చేసిన 6 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందకళ్లతో సమానమని అన్నారు. ప్రతి ఇంటిలో, ప్రతి వాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత్‌కుమార్ శంఖ్వాల్, పరకాల ఏసీపీ కిశోర్ కుమార్, సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్, ఎంపీటీసీ శనిగరం కళాసుధాకర్, మాజీ సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగ్రంథాలయానికి పుస్తకాల వితరణ



ప్రజాగ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ దంపతులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ప్రజా గ్రంథాలయానికి ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్‌నాయక్–సుజాత దంపతులు శనివారం రూ.10వేల విలువ చేసే పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలు రాస్తున్న వారికి ఉపయోగపడే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసినట్లు దంపతులు తెలిపారు. గ్రంథాలయ నిర్వాహకుడు ఎదులాపురం తిరుపతి పుస్తకాలు అందజేసిన ఏఈ దంపతులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డేగల సారయ్య, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, తాళ్లపల్లి వీరేశం, విద్యుత్ సిబ్బంది విజయ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తాం



మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్: మండల వ్యాప్తంగా వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామని ఎంపీడీఓ గుండె బాబు తెలిపారు. ఆయన మిషన్ భగీరథ ఏఈ సుభాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డితో కలిసి మండల కేంద్రంలోని మంచినీటి బావులను శనివారం పరిశీలించారు. వేసవికాలం దృష్ట్యా గ్రామంలోని మంచినీటి బావులను శుభ్రం చేసి తాగునీటి ఎద్దడి లేకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టి తాగునీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. అంతకు ముందు మండలంలోని గోపాల్‌పూర్, శనిగరం, గూనిపర్తి, శ్రీరాములపల్లి గ్రామాల్లోని నర్సరీలను, అంబాలలో ఉపాధి హామీ కింద చేపట్టిన చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. వారి వెంట ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వనసేవకులు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీని ఓడించాలి



హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకునేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఐటీ, సీబీఐలను కేంద్రం తన జేబు సంస్థలుగా వాడుకుంటోందని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో బడా కాంట్రాక్టర్లకు మేలు చేసి రూ.6,500 కోట్ల అవినీతికి బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, రాగుల రమేష్, గొడుగు వెంకట్, దొగ్గెల తిరుపతి, కాడబోయిన లింగయ్య, ధరావత్ భానునాయక్, రాజు, జయశ్రీ, ఉమా, రమ పాల్గొన్నారు.

వైద్యుడిగా సంపత్ సేవలు మరువలేనివి



సంపత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహేందర్, నాయకులు

సంగెం : పేదల వైద్యుడిగా ఆర్‌ఎంపీ పాడేటి సంపత్ అందించిన సేవలు మరువలేనివని హైకోర్టు న్యాయవాది, ఏబీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోట మహేందర్ తెలిపారు. మండలంలోని పల్లారుగూడలో సంపత్ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. తొలుత సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేందర్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీగా సంపత్ పేదలకు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. సంపత్ కుమారుడు ప్రశాంత్ సామాజిక ఉద్యమకారుడిగా ప్రజాసేవ చేస్తుండడం అభినందనీయమని తెలిపారు. సంపత్ మృతి బాధాకరమన్నారు. పేదలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, కలకోటి సత్య పాల్గొన్నారు.

జాతీయోద్యమ వీరుల స్ఫూర్తితో పోరాడాలి



కేయూలో నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: జాతీయోద్యమ వీరుల స్ఫూర్తితో మతోన్మాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు అశోక్‌కుమార్, బాధ్యులు రమేష్, కుమార్ రాథోడ్, ప్రశాంత్, కల్యాణ్, మంగీలాల్, మౌనిక, శిరీష, సురేష్‌రాథోడ్, కల్యాణి, సంగీత, అనూష, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో మొదటి గేట్ వద్ద నిర్వహించి కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కంటి పవన్, వినయ్, రాజేష్ పాల్గొన్నారు.